క్లుప్తంగా

రామాలయ భూమిని స్వాధీనం చేసుకోవాలి

రుద్రూర్: అన్యాక్రాంతమైన చందూర్ శ్రీరామాలయానికి చెందిన వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆలయ కమిటీ సమావేశం తీర్మానించింది. చందూర్ మండల కేంద్రంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, కుల సంఘాల బాధ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కబ్జాకు గురైన ఆలయానికి సంబంధించిన 31 గుంటల వ్యవసాయ భూమిని సాధించేవరకు పార్టీలకతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

నిజాంసాగర్ కెనాల్ పరిశీలన

ఎడపల్లి(బోధన్): ఠాణాకలాన్ శివారులో నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను బుధవారం ఇరిగేషన్ డీఈ లౌక్య నాయక్ పరిశీలించారు. నిజాంసాగర్ డిస్ట్రిబ్యూషన్ కెనాల్ 48వ నంబర్ వద్ద శిథిలమైపోతుందని, ఇప్పటికే కాల్వ కృంగిపోయి పంట పొలాలకు సాగునీరు అందడం లేదని ఈ కాలువ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామ రైతులు ఇటీవల ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ లౌక్య నాయక్ వచ్చి పరిస్థితిని సమీక్షించారు. డీఈ వెంట రైతులు రాజిరెడ్డి, సంతోష్, తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం..

డొంకేశ్వర్(ఆర్మూర్): తొండాకూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్థానిక ఎంపీటీసీ మద్దుల రాణిమురళి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న భోజనం ఏ విధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అదనపు తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని హెచ్ఎంకు సూచించారు.

శ్మశాన వాటిక పనులు..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను బుధవారం ఎంపీడీవో నాగవర్ధన్ పరిశీలించారు. బస్టాండు సమీపంలో కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ సమక్షంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు.

విద్యార్థికి క్యాష్ అవార్డు

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి విజయ్ హైస్కూల్ విద్యార్థి సుక్రీత్ రెడ్డికి ఇన్‌స్పైర్ క్యాష్ అవార్డు లభించింది. గత సంవత్సరం నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సుక్రీత్ రెడ్డి ప్రదర్శించిన సైన్స్ ప్రయోగానికి విద్యాశాఖ అధికారులు రూ.10 వేలు క్యాష్ అవార్డును అందజేశారు. ప్రిన్సిపల్ కవితా దివాకర్ విద్యార్థిని అభినందించారు.

కుర్చీల వితరణ

బాల్కొండ: చిట్టాపూర్ గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్ వాడీ కేంద్రానికి 30 కుర్చీలు, చాపలను అందించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందేలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రవీంద్ర, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

యాదాద్రి దర్శనానికి వెళ్లిన మచ్చర్ల గ్రామస్తులు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి లక్ష్మీ నర్సింహా స్వామి ఆలయ దర్శనానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముందుగా నవనాథ సిద్ధేశ్వర ఆలయాన్ని దర్శించుకుని యాదాద్రి వెళ్లారు. దర్శనానికి ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు దినోత్సవంలో కోటపాటి

పెర్కిట్(ఆర్మూర్): తమిళనాడులో బుధవారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆర్మూర్‌కు చెందిన దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటపాటి నర్సింహ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, బహిరంగ సభలో పాల్గొని కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. తెలంగాణ పథకాలను తమిళనాడులో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

వేల్పూర్: లక్కోర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజరు కవిత, గ్రామ వీడీసీ అధ్యక్షుడు సుదర్శన్ బుధవారం అందజేశారు. డిపో మేనేజరు మాట్లాడుతూ.. వీడీసీ అధ్యక్షుడు సుదర్శన్ విద్యార్థుల బస్‌పాస్‌ల కోసం రూ.5 వేలు వితరణ చేయడం అభినందనీయమన్నారు. విలేజ్ బస్ ఆఫీసర్ శ్రీనివాస్, హెచ్ఎం లక్ష్మణ్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

రుద్రూర్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విజయాన్ని సాధించాలని ఎల్ఆర్‌సీ(రీజనల్ లెవల్ కో–ఆర్డినేటర్) ఎంఏ బషీర్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల ప్రగతి, అధ్యాపకుల పనితీరు పరిశీలించారు. విద్యార్థులు టార్గెట్ ఎలా చేధించాలో వివరించారు. కళాశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు అందజేశారు. ప్రిన్సిపాల్ మహ్మద్ ముబీన్ ఉన్నారు.

ఇంకా అగ్రిమెంట్ స్థాయిలోనే..

- మరమ్మతులకు నోచుకోని డొంకేశ్వర్ పీహెచ్‌సీ
- టెండరు పూర్తయినా మొదలుకాని పనులు
- రూ.15 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) మరమ్మతుల్లో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షల నిధులు మంజూరు చేసి ఏడాది కావస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. టెండరు పూర్తయినప్పటికీ ఇంకా అగ్రిమెంట్ స్థాయిలోనే ఉంది. దీంతో పీహెచ్‌సీకి పూర్తి స్థాయి సౌకర్యాల్లేక వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. డొంకేశ్వర్ పీహెచ్‌సీ ఏర్పాటై దాదాపు 20 సంవత్సరాలు అవుతోంది. దీంతో భవనం కొద్దికొద్దిగా శిథిలావస్థకు చేరుతోంది. గోడలకు పిచ్చి మొక్కలు మొలవడంతో పగుళ్లు ఏర్పడి స్లాబు పైకప్పు నుంచి వర్షపు లీకేజీ అవుతోంది. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. బోరు, ఎలక్ట్రిసిటీ రిపేర్లు కావాల్సి ఉంది. అలాగే గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రి వెనుక భాగం ప్రహరీ కూలిపోయింది. దీంతో పశువులు ఆస్పత్రి ఆవరణలోకి వస్తున్నాయి. వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రుల్లో ఎవరుపడితే వారు వస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అదే విధంగా భవనానికి రంగు వెలిసిపోయింది. ఈ మరమ్మతులన్నీ చేయించడానికి నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రూ.15 లక్షలు మంజూరు చేసింది. పనులు ఇంకా అగ్రిమెంట్ దశలోనే ఉన్నాయి.


ర్యాంపు పరిస్థితి

త్వరగా ప్రారంభించాలని చెప్పాం

మరమ్మతులు చేసేందుకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఇటీవల ఫోన్‌లో మాట్లాడాం. త్వరగా పనులు ప్రారంభించాలని, ముఖ్యంగా కూలిపోయిన ప్రహరీని వెంటనే నిర్మించాలని కోరాం.

– సుచరిత, మెడికల్ ఆఫీసర్, డొంకేశ్వర్


కూలిపోయిన ఆస్పత్రి ప్రహరీ

జీవో–60 ప్రకారం వేతనాలివ్వాలి


ఆర్మూర్ పట్టణంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


నవీపేటలో..

ఆర్మూర్‌టౌన్: జీపీ కార్మికులకు జీవో– 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం ఎదుట బుధవారం జులై 6 నుంచి జరిగే రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివాజీ, పద్మారావు, మల్కన్న, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో..

నవీపేట: జీపీ కార్మికుల సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడీ శ్రీనివాస్ మాట్లాడారు. జీపీ కార్మికుల వేతనం కోసం ప్రత్యేక గ్రాంటును ఏర్పాటు చేయాలన్నారు. జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆంజనేయులు, రాములు, రవి, పోశెట్టి, రాధ పాల్గొన్నారు.

బాల్కొండ ఆస్పత్రికి మత్తు వైద్యుడి కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్లు చేయడం ప్రారంభించారు. ఆస్పత్రిలో మత్తు వైద్యుడు లేకపోవడంతో నెల రోజుల నుంచి సిజేరియన్లు నిలిపేశారు. దీనిపై గత నెల 26న సాక్షి పత్రికలో 'మత్తు వైద్యుడు లేక నిలిచిన ఆపరేషన్లు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వైద్యశాఖ ఉన్నత అధికారులు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధు లు నిర్వహిస్తున్న డాక్టర్ రమేశ్‌ను మత్తు వైద్యుడిగా సేవలను కొనసాగించాలని సూచించారు. దీంతో మంగళవారం ముగ్గురికి ఆపరేషన్ చేసి కాన్పులు చేశారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిప్పొద్దు



బాల్కొండ: కేజ్‌వీల్స్‌తో రోడ్లపై ట్రాక్టర్లను తిప్పవద్దని బాల్కొండ ఏఎస్సై రాజేశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం వన్నెల్(బి)లో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజ్‌వీల్స్‌తో పట్టీలు లేకుండా ట్రాక్టర్‌లను రోడ్లపై నడిపేత సీజ్ చేస్తామని హెచ్చరించారు. బైక్‌లపై వెళ్లే వారు హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉప సర్పంచ్ నాగులపల్లి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ వెబ్‌సైట్ల జోలికెళ్లొద్దు

ఆర్మూర్‌టౌన్: అవగాహన లేకుండా ఉన్న ఫేక్ వైబ్‌సైట్ల జోలికి వెళ్లి మోసపోవద్దని ఆర్మూర్ ఎస్సై రాములు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోలీసు కళాబృందంతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ.. పార్ట్‌టైం జాబ్స్, లోన్ ఫ్రాడ్స్, లక్కీ లాటరీ పేరిట వచ్చే యాడ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. అనంతరం పోలీస్ కళాబృందం సభ్యులు పాటల రూపంలో సైబర్‌క్రైంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!

మాక్లూర్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై గంగాధర్ సూచించారు. బుధవారం చిక్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్యవివాహాలు చేయటం మానుకోవాలన్నారు. మూఢనమ్మకాలు, భూత వైద్యులను నమ్మవద్దని సూచించారు.

మెగా మేళాలో జాబ్ సాధించారు


నియామక పత్రం అందుకుంటున్న అభ్యర్థులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ ఆధ్వర్యంలో నిర్వహించి మెగా జాబ్ మేళాకు హాజరై ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు నియామక ప్రతాలను అందించారు. ఈ జాబ్ మేళాకు 3 వేల మంది అభ్యర్థులు హాజరు కాగా 82 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. కాగా 2 వేల మంది ఉద్యోగాలు సాధించారని, ఇందులో 500 మందికి నియామక పత్రాలు అందించగా మరో 1500 మందికి షార్ట్ లిస్టును అందించినట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తెలిపారు.

బీజేపీ పథకాలపై ఇంటింటి ప్రచారం



అమ్రాద్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మాక్లూర్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం అమ్రాద్ గ్రామంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరిస్తూ మండల బీజేపీ నాయకులు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోదీ 9 సంవత్సరాల పాలనలో ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించి చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు కంచెట్టి గంగాధర్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, పాన్ శ్రీను, గంగోనే సంతోష్, కాలగడ్డ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఆర్మూర్‌టౌన్: మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో బుధవారం ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు, ఎంపీవో కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, మధ్యాహ్న భోజన నిర్వహణ అక్షయపాత్రకు ఇవ్వడం విరమించుకోవాలన్నారు. 10, 11,12వ తేదీలలో కార్మికులు టోకెన్ సమ్మె చేస్తున్నాట్లు పేర్కొన్నారు.

సమాచారం..

■ 7న వరంగల్‌లో వీహెచ్‌పీఎస్ జాతీయ సదస్సు



బోధన్: దివ్యాంగుల సమస్యలే ప్రధాన ఎజెండాగా ఈ నెల 7న వరంగల్ జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీఎస్ నేతృత్వంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సమితి మహిళ విభాగం జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ తెలిపారు. బుధవారం బెల్లాల్ గ్రామంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగుల ఫించన్ రూ.6 వేలకు పెంచాలని, దళిత బంధు మాదిరిగానే దివ్యాంగుల బంధును ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద క్రిష్ణ మాదిగ, పలువురు జాతీయ స్థాయి నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

■ నేడు మంత్రి, ఎమ్మెల్యే పర్యటన

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో గురువారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పర్యటించనున్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ తెలిపారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా మంత్రి, ఎమ్మెల్యే పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు.

■ రేబిస్ టీకాల కార్యక్రమం

డొంకేశ్వర్/రుద్రూర్): రేబిస్ వ్యాధి నివారణకు గురువారం(6న) టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, రుద్రూర్ పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి బుధవారం వేర్వేరుగా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు వైద్య శాలల్లో టీకాలు వేస్తామన్నారు. పెంపుడు జంతువుల యజమానులు తమ పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించాలని కోరారు.

ఆరోపణల్లో కాదు.. అభివృద్ధిలో పోటీపడాలి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: ప్రతిపక్షాలు తనపై ఎన్ని అసత్య ఆరోపణలు చేస్తే అంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తానని, విమర్శలకు తగ్గే ప్రసక్తే లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ నుంచి వేల్పూర్, కొత్తపల్లి ఎన్ మీదుగా చింతలూరు వరకు, అక్లూర్ నుంచి బడాభీమ్‌గల్ వరకు రూ. 33కోట్లతో చేపట్టే డబుల్ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు అభివృద్ధిలో తనతో పోటీ పడాలని, అభివృద్ధి నిధుల మంజూరు జీవో కాపీలు చూపెట్టాలని సవాల్ చేశారు. రాష్ట్ర పర్యటనకు వచ్చే ముందు ప్రధాని మోదీ రూ.రెండు వేల కోట్ల ప్యాకేజీని తెలంగాణకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధాని అన్ని రాష్ట్రాలకు తండ్రిలాంటివాడు, అన్ని రాష్ట్రాలను సమానంగా చూసే బాధ్యత ఆయనపై ఉంటుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు మధుశేఖర్, రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ భారతి, సొసైటీ ఛైర్మన్ లింబారెడ్డి, సర్పంచులు శ్వేత, నితీష్‌కుమార్ తదితరులున్నారు.


శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లివ్వాలి

కమ్మర్‌పల్లి: వర్షాల లేమి పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉన్నందున చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు అందించాలని కమ్మర్‌పల్లి మండల రైతులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి విన్నవించారు. బుధవారం డీసీ తండాలో పోడు భూముల పట్టా పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కమ్మర్‌పల్లిలో రైతులు కలిసి పంటల పరిస్థితిని వివరించారు. స్పందించిన మంత్రి అక్కడి నుంచే ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి డీ–4 కెనాల్ ద్వారా షెట్‌పల్లి చెరువుకి నీరు విడుదల చేయాలని ఆదేశించారు. అనంతరం నిజామాబాద్ ఇరిగేషన్ సీఈ మధుసూదన్‌రావుతో మాట్లాడి పరిస్థితిని వివరించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

బోధన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఈవీఎల్ నారాయణ మాట్లాడుతూ.. పెన్షనర్స్‌కు మధ్యంతర భృతిని ప్రకటించి, వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెన్షనర్ల సంక్షేమం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయకుండా ఆర్థిక ప్రయోజనాలు అందకుండా అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, ఉషాన్, ప్రతినిధులు పాల్గొన్నారు.


బోధన్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్లు

అలీసాగర్ నీటి విడుదల

- తాగునీటి అవసరాలకు..

నవీపేట: నిజామాబాద్ నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు బుధవారం అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని వదిలారు. ఇరిగేషన్ ఏఈ ప్రణయ్‌రెడ్డి కోస్లీ శివారులోని పథకం మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పథకం నుంచి పైపులైన్, డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా ఎడపల్లి మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని నింపి, అక్కడ నుంచి నగరంలోని మంచినీటి ట్యాంకులకు నీటిని మళ్లించనున్నట్లు చెప్పారు. అయిదు రోజుల పాటు ఈ నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు. వర్షాలు విస్తారంగా కురిసి, గోదావరిలో నీటి ఉధృతి పెరిగాక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సాగునీటిని విడుదల చేస్తామని ఆయన వివరించారు.



అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలి



బోధన్: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలని కోరుతూ బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో ఏవో ముంతాజుద్దీన్‌కు ఏఐఎస్‌బీ నాయకులు వినతి పత్రం అందించారు. విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సకాలంలో పాఠ్య పుస్తకాలను అందించాలన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేరాలి

ఆర్మూర్‌టౌన్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని డీఐఈవో రఘురాజ్ కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర కళాశాలలను ఆయన సందర్శించారు. అలాగే అధ్యాపకులతో కలిసి ఆర్మూర్ మండలంలోని అమ్దాపూర్, మగ్గిడి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. బాలికల కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న రాజకళా డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా ఆమెను డీఐఈవో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ అక్బరీ బేగం పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

బోధన్/బోధన్‌టౌన్: పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, మాంగళ్యధారణ, తలంబ్రాలు, మాల మార్పిడి, మంగళ హారతి కార్యక్రమాలను వేదపండితులు శ్రీధరాచార్యులు, ఆలయ పూజారి దీపక్ పాండేల సహకారంతో కొనసాగించారు. మారం రాజు, ప్రియలత, కాసాపురం శ్రీనివాస్, పద్మ, వల్కాటి సహదేవ్, భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

వర్ని: సత్యనారాయణపురం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజు అవినీతి అక్రమాలపై బుధవారం వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సత్యనారాయణపురం జీపీ పరిధిలోని కోటయ్య క్యాంపులో ఉపాధి హామీ కూలీలు చేసిన పనికి సరైన వేతనం ఇవ్వకుండా, పనిచేయని కూలీలకు అధికంగా పేమెంట్ చేయటం పట్ల కూలీలు వర్ని ఎంపీడీవోకు ఫిర్యాదు చేయడంతో బుధవారం జీపీలో ప్రత్యేక విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజు తన బంధువులు, అనుచర వర్గం కూలీలు పని చేయకున్నా జాబ్ కార్డుల్లో పని చేసినట్లు చూపించడం, తదితర విషయాలపై వారం రోజుల క్రితం ఉపాధి హామీ కూలీలు వర్ని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలను ఎంపీడీవోను అడిగారు. ఈ విషయమై జీపీలో బుధవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన గంగపుత్ర సంఘం సభ్యులు


మంత్రి వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కమ్మర్‌పల్లి గంగపుత్రులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం సభ్యులు బుధవారం మంత్రి వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా గాంధీనగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్, బీఎస్పీలకు చెందిన కార్యకర్తలు కూడా బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ జనరంజక పాలన, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని గంగపుత్ర సంఘం సభ్యులు, ఇతర పార్టీల కార్యకర్తలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్, సర్పంచ్ స్వామి, ఎంపీటీసీ సుధాకర్, కో–ఆప్షన్ మెంబర్ అజ్మత్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అమ్దాపూర్‌కి చెందిన కచకాయల పెద్ద నర్సయ్య బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఈ సందర్భంగా నర్సయ్యను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో..

మాక్లూర్: ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నియోజక వర్గ నాయకుడు పీఏ సాగర్, మానిక్‌భండార్ యూత్ నాయకులు అనిల్‌లు బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.